# ఒప్పుకోలేము




వెన్నెల రాత్రులలో డాబామీద పడుకుంటే శారద గుర్తుకురాకుండా వుండదు. చాలా వెన్నెల రాత్రుల్లో శారదకూ– నాకూ మధ్య ఎన్నో ఆసక్తికరమయిన సంభాషణలు జరిగాయి.

కొంతమంది మనుషులున్నారు– మనసులో ఏదో వుంచుకొని బయటకు చెప్పలేక, చెప్పగలిగినా ఎదుటిమనుషులకు భయపడి నంగిగా మాట్లాడుతూ వుంటారు. అటువంటి మనుషులంటే నాకు జాలి. తను నమ్మినదాన్ని చెప్పి తనకు కావలసినదానికోసం పోరాటం జరిపే జాతి మరొకటి వుంది.

ఆ విలక్షణమైన జాతికే శారద కూడా చెందుతుంది.

వయసు– దాన్ని మించిన ఆకర్షణ శారద సొంతం. కళ్లు చెదిరే అందం– ఎదుటి

మనుషులను సులభంగా ఆకట్టుకొనే మాటలు, చూపులు ఆమెవి. ఆమెతో మాట్లాడుతూ ఎన్ని యుగాలయినా గడపగలమనుకోవటం సులభమే అనిపిస్తుంది.

ఒక్కోసారయితే మాటలతోనే మా ఇద్దరికీ తెల్లవారిపోయేది. మా అక్కలిద్దరూ ఎప్పుడో నిద్రపోయేవాళ్లు.

"ఏం మనుషులో వీళ్లు?" అనేది హాయిగా నిద్రపోతున్న వాళ్లని చూస్తూ-

వయసులో వున్నది కాబట్టి శారద ఎప్పుడూ ప్రేమ గురించే మాట్లాడేది. ప్రేమ అనేది ఆమె హృదయం మీద ఎంత గట్టి ముద్రను వేసిందీ నేనెప్పుడో తెలుసుకున్నాను.

ఒకసారడిగింది "నీకు ప్రేమంటే తెలుసా" అని.

నేనన్నాను. "అప్పుడేనా? ఎలా తెలుస్తుంది?"

నవ్వి "నీ మొహం. అప్పుడేనా అంటున్నావా? నువ్వు చదువుతున్నది ఇంటర్‌కదూ? ప్రేమంటే తెలీదూ? కబుర్లు చెప్పకు" అన్నది.

నిజంగా నాకు తెలీదని చెప్పినా శారద వినిపించుకోలేదు.

చివరికి "ఐనా చెబుతాను. ప్రేమంటే ఇద్దరు యువతీయువకుల మధ్య వుండే ఆకర్షణ. హృదయంలో పొంగే గొప్ప మధురమయిన భావన" అన్నది.

"అంటే?" తెలిసినా అడిగేను.

"ఓ అమ్మాయిని ప్రేమించు. తెలుస్తుంది."

అలా అని నవ్వింది శారద. నవ్వినప్పుడు శారద పెదవులు విచ్చుకున్నాయి. ఆమె అందం నన్ను పరవశుడిని చేసింది.

ఆమె కంటే నేను నాలుగేళ్లు చిన్నవాడిని అవకుండా వుంటే ఎంతో బావుండేది. ఆమె మాకు దూరపు బంధువు అవుతుంది. ఐనా వాళ్ల వూరినించి తరచు మా ఇంటికి వస్తూనే వుంటుంది.

శారద మా ఇంటికి వచ్చిందంటే సంతోషమే.

నిజంగా శారద అన్నట్టుగా మా అక్కయ్యలిద్దరూ మొద్దులే. శారద చెప్పే ప్రేమ కబుర్లంటే వాళ్లకు భయం. అందుకే వాళ్లు శారద కబుర్లకు నన్ను ఎరగా వేసి హాయిగా తలకింద చేతులు పెట్టుకుని నిద్రపోయేవాళ్లు.

ఓరాత్రి- ఆ సాయంత్రమే శారద మా ఇంటికివచ్చింది. భోజనాలయిన తర్వాత పక్కబట్టలు డాబామీదకు మోసుకు రావటంలో ఆమె నాకు సహాయపడింది. పదిగంటలు కావస్తున్నప్పుడు మా అక్కలిద్దరూ దుప్పట్లు ముసుగుపెట్టి నిద్రలో మునిగిపోయిన తర్వాత చిన్నగా అన్నది శారద-

"నేనీ మధ్య ప్రేమలో పడ్డాను"

"నిజమా!" ఆశ్చర్యంగా అడిగాను.

“ఎందుకంత ఆశ్చర్యం? తప్పంటావా?”

“అహ... తప్పనికాదు. కొంచెం నటించానులే. చెప్పు... ఎవరతను?ఎక్కడుంటాడు?”

“మా వీధిలోనే వుంటాడు. ఈ మధ్యనే అంటే ఓ ఇరవై రోజులక్రితం మా వీధిలో ఓ గదిలోకి అద్దెకు దిగాడు. ఏదో ప్రభుత్వ కార్యాలయంలో క్లర్కుగా ఉద్యోగం చేస్తున్నాడు.”

“ఎలా వుంటాడు? నాలా వుంటాడా?” ఆమె కళ్లలోకి చూస్తూ అడిగాను.

“ఏం? అలా అడిగావ్? నువ్వు గొప్ప అందగాడివా?”

“ఏమో! నాకు తెలీదు. వూరికే అడిగాను. అతని రూపాన్ని వూహించుకోవటానికి”

“సన్నగా, నాజూగ్గా, అందంగా వుంటాడు”

“ఇంతకీ మీ ఇద్దరికీ పరిచయం ఎలా జరిగింది?”

“చాలా సింపుల్. అతను రోజూ మా ఇంటిముందునించే ఆఫీసుకు వెళ్లేవాడు. కిటికీ దగ్గర నిల్చుని బొట్టు పెట్టుకుంటూ కనపడేదాన్ని. చూపులు కలిశాయి. అతడి చిరునవ్వుకు నేను జవాబిచ్చాను. ఒకరోజు కాలేజీనించి వచ్చేటప్పుడు రోడ్డుమీద ఎదురయి నన్ను పలకరించాడు”

“ఏమని?”

“మీ పేరేమిటి?”

“చెప్పావా? మరి”

“చెప్పకుండా ఎలా? చెప్పేశాను. తన పేరు, వివరాలు కూడా చెప్పాడు. ఆరోజు అలా ముగిసింది. మరురోజు కూడా అతను కలిశాడు. రాత్రంతా నాగురించే ఆలోచించాననీ, నా అందం అతడిని ఎంతగానో ఆకర్షించిందనీ చెప్పాడు. నాకూ ఆ రాత్రి అతని రూపమే కళ్లముందు కదిలింది. అతడి మాటలు నాకు పదే పదే వినిపించాయి. అతను ఒకసారి దారిలో కలిసి ఓ ఉత్తరాన్ని నాకిచ్చి చదవమన్నాడు. దాన్ని అందుకొంటున్నప్పుడు నా చెయ్యి చిన్నగా వణికింది. స్నానాల గదిలో దాన్ని నాలుగుసార్లు చదివి ఇంట్లో అంతా నిద్రపోయాక నేనూ అతన్ని ప్రేమిస్తున్నట్టుగా ఓ ఉత్తరం రాయకుండా వుండలేకపోయాను”

“చాలా ఫాస్టుగా వుంది” అన్నాను అంతా విని.

“అవును. రాత్రి అతనితో సినిమాకు వెళ్లాను”

“అతనితో సినిమాకే!”

“ఆ... నిజంగా ఎంత థ్రిల్లింగా వుందనీ!”

“ఎలా వుంది?చెబుతావా?”

“చెప్పటం కష్టమే. నువ్వూ ఓ అమ్మాయితో సినిమాకు వెళ్లు. తెలుస్తుంది”

ఆరాత్రి ఎప్పటకో మా ఇద్దరికీ నిద్ర.

తర్వాత శారద వెళ్లిపోయినా ఆమె మాటలు నా అంతరంగంలో ప్రతి నిమిషం

కదులుతూనే వున్నాయి.

ఏమయినా శారదలో వేగం ఎక్కువ. బాగా చురుగ్గా వుంటుంది. చదువులో కూడా శారద తెలివయినది. మా అక్కలిద్దరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకునేది. మా అక్కలు ఎప్పుడూ హాయిగా భోజనాలు చెయ్యటం- పుస్తకాలు ముందేసుకుని నిద్రపోవటం- ఎప్పుడో మెలకువ వచ్చినప్పుడు కొంచెం చదివేవాళ్లు.

నెలరోజుల తర్వాత చీకటి పడుతుండగా ఒకరోజు ప్రత్యక్షమయ్యింది శారద హటాత్తుగా-

"ఈరోజు మనకు చదువులేదు" అక్కలన్నారు.

"రోజూ తెగ చదువుతున్నారులే" అన్నది శారద.

ఆమె అలా అన్నదని అక్కలిద్దరూ అతికష్టంమీద రాత్రి తొమ్మిదిన్నర వరకూ చదివి ఆ పుస్తకాలమీద పడి నిద్రపోయారు.

"ఎంతవరకు వచ్చింది నీ ప్రేమకథ?" అడిగాను.

"చాలా దూరం వెళ్లింది. అతనితో ఇంకో రెండు సినిమాలు చూశాను. అతను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఒకసారి అతని గదికి కూడా వెళ్లాను"

"గదికి వెళ్లావా!"

"అవును. ఏం తప్పా?"

"నాకు తెలీదు"

ఆ తర్వాత ఏమనాలో నాకు తెలీలేదు. ఆ గదిలో ఇద్దరి మధ్యనా ఏమీ జరిగి వుండదా అనే ప్రశ్న నన్ను బాగానే వేధించింది. ఆ విషయం గురించి శారదే చెబుతుందని ఎదురు చూశాను. కానీ చెప్పలేదు. అతడితో తన వివాహజీవితం గురించీ, రంగుల భవిష్యత్తు గురించీ చెప్పింది.

ఆరాత్రి శారద ప్రేమికుల గురించి- ప్రేమకథలు- ప్రేమ సినిమాలు- ప్రేమ త్యాగాల గురించి ఎంతోసేపు మాట్లాడింది. ఆరాత్రి నేను కేవలం శ్రోతనే.

శారద మాటలు నా మీద మంచి ప్రభావాన్నే చూపించాయి. ఎవరయినా అందమయిన అమ్మాయి కనిపించినప్పుడల్లా ఆ అమ్మాయిని ప్రేమించాలని అనిపించేది.

కాని- అలా అనుకుంటే ఎంతమందిని ప్రేమించగలను? ఒకమనిషి ఒకరికంటే ఎక్కువమందిని ప్రేమించే అవకాశం వుంటుందా? ఈ ప్రశ్నకు జవాబు శారదనే అడిగి తెలుసుకోవాలని అనుకున్నాను.

కానీ రెండు నెలలు గడిచినా శారద రాలేదు.

అన్ని రోజుల పాటు శారద మా ఇంటికి రాకుండా వుండటం అదే మొదటిసారి.

శారద రాలేదుగానీ ఆమె తల్లి దగ్గర్నించి మా నాన్నను వెంటనే బయల్దేరి రమ్మని

ఉత్తరం వచ్చింది. శారదకు తండ్రిలేడు.

ఆరోజు సాయంత్రమే మా నాన్న వెళ్లాడు. ఆ మరురోజు రాత్రికి శారద మా ఇంట్లో వుంది. శారద మొహం ఎప్పటిలా లేదు. మా ఎవ్వరితోనూ మాట్లాడలేదు. అమ్మను కావలించుకుని భోరున ఏడ్చింది.

ఆనిజం తెలిసినప్పుడు షాక్... శారదకు మూడోనెల.

మరో విషాదం.

ఫాస్ట్ గేమ్‌లో శారద ఘోరంగా ఓడిపోయింది. అతడు ఆమెను చిత్తుగా మోసం చేశాడు. ఎవరో సెలవు పెడితే ఆ ఖాళీలో నాలుగు నెలలు అతడిని వేశారుట. ఉద్యోగం అయిపోగానే అతను శారదకు చెప్పకుండానే వూరొదిలి వెళ్లిపోయాడుట.

ఎబార్షన్ చేయించమనీ, నలుగురికీ తెలిస్తే శారద పెళ్లికాదనీ మా ఇంటికి పంపించింది ఆమె తల్లి.

ఆడదానికి తొందరపాటు పనికిరాదనీ, ఎంతో నెమ్మదిగా వుండాలనీ- వ్యామోహంలో పడి పరుగుతీస్తే జీవితం కష్టాలమయం అవుతుందనీ- ఆరాత్రి మా అమ్మ శారదకు హితబోధ చేసింది. మా అక్కలిద్దరూ శారదకు తమ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసి తొమ్మిదిన్నరవగానే పుస్తకాల తలకింద పెట్టుకొని నిద్రపోయారు.

ఆరాత్రి అలా నిద్రపోతున్న వాళ్లని చూస్తూ-

“నిజంగా వీళ్లు అదృష్టవంతులు” అని ఎక్కిళ్లమధ్య శారద అన్నప్పుడు నాకెంతో బాధ కలిగింది. చాలాసేపటి వరకూ ఆమె కుమిలి కుమిలి యేడుస్తూనే వుంది. తన రాత బావుండలేదనీ, అందుకే మొదటి ప్రేమకథ ఎదురు తిరిగిందనీ, ఇక తనకు ఎవర్నీ ప్రేమించే అర్హత లేదనీ పిచ్చిగా మాట్లాడింది.

ఎంతలో ఎలాంటి మార్పు?

మానాన్న ఒక డాక్టరుతో బేరమాడి శారదకు ఎబార్షన్ చేయించాడు.

ఇక అన్ని పనులూ వేగంగా జరిగిపోయాయి.

శారద చదువు మానేసింది. మానాన్న ఓ నెలరోజులు ఆంధ్రదేశమంతటా పర్యటించి శారదకు ఓ మొగుడిని సంపాదించుకు వచ్చాడు. అతనెవరు? ఎలా వుంటాడు? అని అడక్కుండానే అతనిచేత మూడుముళ్లు వేయించుకున్నది.

తలవంచుకుని మొగుడి తలమీద శారద తలంబ్రాలు పోస్తున్నప్పుడు నా గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టు అనిపించింది. తప్పదు. ఇది జీవితం. రాజీపడక తప్పదు.

“ఉత్తరాలు రాస్తావు కదూ?” వెళ్లబోయే ముందు అన్నాను.

“తప్పకుండా” వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నది వెళ్లిపోతూ-

అలా వెళ్లిన నాలుగు నెలలకు శారద ఓ ఉత్తరం రాసింది.

డియర్ గిరీ-

ఆయన నన్ను బాగానే చూస్తున్నాడు. చాలా యాంత్రికంగా యిల్లాలి పాత్రను నిర్వహిస్తున్నాను. ఇప్పుడు నాకు మూడోనెల. మనసులో బాధగా వుంది. ఆయన్ని మోసం చేస్తున్నట్టు గిల్టీగా వుంది. ఎప్పటికప్పుడు నా జీవితం గురించి ఆయనతో చెప్పాలనే ఆవేశం కలుగుతోంది. కానీ ఏదో భయం. నేనేం చేసేది? ఎప్పుడో ఒకసారి ఆయనతో అంతా చెబుతాననే అనిపిస్తోంది. అలా జరక్కుండా వుండే ధైర్యం కోసం దేవుడిని వేడుకుంటున్నాను- శారద.

మనిషికి తెలిసీ- తెలియక చేసినా ఓ తప్పు గురించిన చింతన- పశ్చాత్తాపం అవసరమనే నా ఉద్దేశం. మొగుడిని మోసగిస్తున్నందుకు శారద బాధపడటం నాకు న్యాయంగానే అనిపించింది. ఏదయినా ఒక పాపాన్ని సమూలంగా తుడిచివేసేది మానసిక క్షోభ మాత్రమే.

ఐతే- నేను వూహిచని విధంగా మరో ఇరవై రోజులకే శారద మరో ఉత్తరం రాసింది.

డియర్ గిరీ-

ఇంత త్వరగా నా మానసిక క్షోభకీ, బాధకీ కళ్లెం పడుతుందని వూహించలేక పోయాను. ఈ మధ్య కొన్ని రోజుల క్రితం ఆయన బంధువుల ఇంటికి వెళ్లాను. అక్కడే ఈ నిజం తెలిసింది. ఆయన సామాన్యుడు కాదుట. ఓ అమ్మాయిని ప్రేమించానని చెప్పి అన్ని కోర్కెలూ తీర్చుకుని నిర్దాక్షిణ్యంగా వదిలి వేశాడుట. ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందిట. ఈ నిజం తెలిసిన తర్వాత ఇప్పుడు ఆయన్ని మోసం చేస్తున్నాననే ఫీలింగ్ కలగటం లేదు. ఏదో తృప్తిగా వుంది. నిర్లక్ష్యంగా కూడా వుంది. ఇప్పుడు నా మనోధైర్యాన్ని గురించి దేవుడిని వేడుకోవలసిన అవసరం లేదు. ఇప్పుడు నాకు సంతోషంగా వుంది- శారద.

ఆ ఉత్తరాన్ని చదివిన తర్వాత ఎందుకో నా మనసు ఎదురు తిరిగింది. శారద ఆలోచనలను నేను ఒప్పుకోలేదు. ఎందుకంటే- ఎవరినేరం వారిదే- ఎవరి శిక్ష వాళ్లదే- కొట్టివేతలు వెయ్యటానికి ఇది గణితం కాదు. జీవితం.

మగాడి జీవితం వెండి అరిటాకు లాంటిదని శారద గ్రహించలేకపోయిందని ఆ ఉత్తరం ద్వారా తెలుసుకున్నాను. ఆమె గురించిన నిజం తెలిసినప్పుడు శారద మొగుడు తన గతాన్ని పక్కన పెట్టి, పరుగెత్తిన కాలం ఆమె జీవితం మీద మిగిల్చిన వికృతమైన మచ్చ గురించే అతను నిలదీసి అడిగినప్పుడు- అప్పుడు శారదకేమిటి దారి??

(4-4-1986 స్వాతి వారపత్రికలో ప్రచురితం)